ప్రజాశక్తి

గురువారం 13 మార్చి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

వ్యాపారమే పరమావధిగా..!

◆ పోర్టు స్టేడియం లీజు వ్యవహారంపై చర్చ ◆ 'టెండరు' కొంతే.. మిగతా అంతా ఆక్రమణ అంటూ విమర్శలు

◆ లక్ష్యాలకు దూరంగా పోర్టు కళావాణి : సీనియర్ సిటిజన్ల ఆవేదన

పోర్టు స్టేడియం వద్ద విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ పేరిట ఉన్న బోర్డులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరం నడిబొడ్డునగల పోర్టు కళావాణి స్టేడియం వద్దకు ఎవరైనా అడుగుపెడితే అవాక్కవ్వాల్సిందే. విశాఖ పోర్టు అథారిటీకి చెందిన 'కళావాణి స్టేడియం'నకు ఆ బోర్డులెక్కడా కనిపించవు. స్టేడియాన్ని పోర్టు కాంట్రాక్టర్లకు అమ్మేసిందా ? అనేలా బయట 'విశ్వనాథ్ కన్వెన్షన్' అని ఒకచోట, విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్' అని మరోచోట.. ఇలా బయట గేటు నుంచి లోపలకు వెళ్లేదాక ప్రైవేట్ కాంట్రాక్టరు బొడ్డేటి కాశీ విశ్వనాథ్ పేరుతోనే ప్రాంగణం అంతా కనిపించడం గమనార్హం. రాష్ట్రంలోనే ప్రభుత్వ ఆధీనంలోగల అతిపెద్ద స్టేడియం ఇది. నగర పౌరులే కాదు పోర్టు ఉద్యోగులు, అధికారులు సైతం అక్కడకు వెళ్లినా ప్రైవేట్ సెక్యూరిటీ అడ్డుకునే పరిస్థితులు నెలకొన్నాయి. స్టేడియం కనిపించదు... స్పోర్ట్స్ జరగవు. ప్రస్తుతం నడుస్తున్నదంతా

స్నో స్టేషన్ స్వాగత ద్వారం

వ్యాపార వినోదమే. సుమారు 15 ఎకరాల ఈ పోర్టు కళావాణి నేడు వాణిజ్య క్షేత్రమై 'టెండరు' పాడుకున్న కాంట్రాక్టరు గుప్పెట్లో విలవిల్లాడుతోంది. కేవలం ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలను ఏటా రూ.2 కోట్లకు రెండేళ్ల క్రితం లీజు పాడుకున్న కాశీ విశ్వనాథ్ తన టెండరుతో నిమిత్తం లేకుండా పోర్టు కళావాణి ప్రాంగణం అంతటినీ వినియోగించుకోవడం చర్చనీయాంశమైంది. .కొంతమంది పాత ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను మినహాయిస్తే ఫీజు లేకుండా పోర్టు ఉద్యోగులు, కార్మికులు సైతం లోపలకు ప్రవేశించేందుకు అవకాశం లేదు. వారికి సైతం మనిషికి నెలకు రూ.1100 చెల్లించాల్సిందేనంటూ కాంట్రాక్టరు చెబుతున్నారు.

క్రీడా స్ఫూర్తికి విఘాతం

అథ్లెటిక్స్ గ్రౌండ్ రన్నింగ్ ప్రాక్టీస్‌కు ఎంతో వీలుగా ఉండడంతో స్కూలు, కాలేజీ విద్యార్థులు ఇక్కడకు రోజూ వచ్చి గతంలో ప్రాక్టీస్ చేసేవారని వాకర్స్, సీనియర్ సిటిజన్‌లు గుర్తు చేసుకుంటున్నారు. స్టేడియంలో ఒకటో, రెండో స్థలాలు కాకుండా మొత్తం పోర్టు స్టేడియం పోర్టు చేతుల నుంచి జారిపోతోందంటూ వారు 'ప్రజాశక్తి'కి తెలిపారు. పోర్టు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మిగతా 2లో..

స్వతంత్ర నగర్‌లో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

సమస్యలు తెలుసుకుంటూ.. చైతన్యపరుస్తూ..

ఉత్సాహంగా సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు వార్త 5లో..

విశాఖలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులు

ఆర్ఎఫ్‌పి విడుదల చేసిన విఎంఆర్‌డిఎ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులను విఎంఆర్‌డిఎ పిపిపి విధానంలో నిర్మించేందుకు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పి)ను బుధవారం సాయంత్రం విడుదల చేసింది. ఈ ఐకానిక్ ప్రాజెక్టులు స్థానిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి, ఉపాధి అవకాశాలు సృష్టించడానికి మిగతా 2లో..

15న జెడ్‌పి స్థాయీ సంఘాల సమావేశాలు

▶ వార్త 8లో..

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

▶ వార్త 8లో..

బ్యాంకు ఉద్యోగుల నిరసన

▶ వార్త 8లో..

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సిపి, ఎయు విసి

సైబర్ సెక్యూరిటీలో యువత నిపుణులుగా మారాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యువతరం సైబర్ నేరాలను నియంత్రించే నిపుణులుగా తయారు కావాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. బుధవారం సాయంత్రం ఎయు ఇంజినీరింగ్ కళాశాల వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఎయు కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఐదు రోజుల బూట్ క్యాంప్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహకారంతో ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ మిగతా 2లో..

పేదల గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సహాయం వివరాలు తెలిపేందుకు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంఎవైలో ఇల్లు మంజూరై ఇంకనూ వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న గృహాలకు అదనంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. అందుకు అనుమతిస్తూ జిఒఆర్‌టి నెంబర్ 9 ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇళ్లు మంజూరై ఇంకనూ వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ప్రస్తుత యూనిట్ విలువ 1.80 లక్షల రూపాయలకు అదనంగా ఎస్సీలకు 50 వేలు, బీసీలకు 50 వేలు, ఎస్టీలకు 75 వేలు, పివిటిజిలకు లక్ష రూపాయలు చొప్పున అదనపు సాయం అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పిఎంఎవై అర్బన్, గ్రామీణం కింద ఒకటి, రెండు ఆప్షన్లలో మిగతా 2లో..

కలెక్టరేట్ల వద్ద వైసిపి 'యువత పోరు'

విశాఖ, అనకాపల్లి జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ / అనకాపల్లి

విశాఖలో నిరసన తెలుపుతున్న కన్నబాబు, అమర్‌నాథ్

విశాఖ, అనకాపల్లి కలెక్టరేట్ల ఎదుట వైసిపి ఆధ్వర్యాన 'యువత పోరు' పేరిట బుధవారం ఆందోళనలు జరిగాయి. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నేతలు హాజరై మాట్లాడారు. విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్ వద్ద ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి, వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు మాట్లాడుతూ యువత పోరు కార్యక్రమాన్ని పోలీసుల ద్వారా ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేసిందన్నారు. ప్రజా పోరాటాలు చూసి చంద్రబాబు ఎందుకు వణికిపోతున్నారని ప్రశ్నించారు. కూటమి ఇచ్చిన హామీలన్నీ మోసపూరితమైనవని విమర్శించారు. ప్రభుత్వ పరిధిలో మెడికల్ కాలేజీలను జగన్ తీసుకొస్తే సిగ్గు లేకుండా వాటిని చంద్రబాబు అమ్మాలని చూస్తున్నారని ఆరోపించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ యువతకు ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర బడ్జెట్‌లో తగిన కేటాయింపులు లేవన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయ్ ప్రసాద్, వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వ్యాపారమే పరమావధిగా..!

ఇదంతా జరుగుతోందని చెబుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్లను అందించిన పోర్టు స్టేడియాన్ని అధికారులు గాలికొదిలేశారని వారంతా విమర్శిస్తున్నారు. క్రీడా స్ఫూర్తికి విఘాతం కలుగుతున్నా ఉన్నతాధికారులకు పట్టడం లేదని, వారికి నెలనెలా ముడుపులు ముడుతుండటమే దీనికి కారణమని వారంతా ఆరోపిస్తున్నారు.

లీజుకు ఏమిచ్చారు ?

స్టేడియంలో ఇండోర్, అథ్లెటిక్స్ గ్రౌండ్ ప్రాంగణాలను మాత్రమే రెండేళ్ల క్రితం సుమారు రూ.2 కోట్లకు లీజుకు పోర్టు ఇచ్చింది. ఇండోర్ స్టేడియం, అవుట్‌డోర్ కలిపి ఏటా రూ.81 లక్షలు, కళావాణి ఆడిటోరియం రూ.1.2 కోట్లు మొత్తంగా రూ.2 కోట్లు టెండరు ఇది. ఈ టెండరు పాడుకున్న నుంచీ సదరు లీజుదారు మొత్తం పోర్టు స్టేడియాన్ని పూర్తిగా వ్యాపార మయం చేశారు. చాలా వరకూ ఈ ప్రాంగణంలోని చెట్లను సదరు కాంట్రాక్టరు నరికేశారంటూ వాకర్స్ ఆరోపిస్తున్నారు. వరల్డ్ క్లాస్ స్టేడియంగా చేసేందుకుగానూ అండర్ యుటిలైజేషన్ స్థలం అంటే రాబడి లేని భూమిని మాత్రమే కాంట్రాక్టరుకు ఇవ్వాలని పోర్టు నిబంధన ఉన్నా సరే వాటన్నిటినీ పోర్టు అధికారులు తుంగలో తొక్కి కాంట్రాక్టరుకు కొమ్ముకాశారు. స్టేడియం లోపల రాజీవ్ గాంధీ ఎసి ఇండోర్ స్టేడియాన్ని పూర్తిగా లాడ్జీల మాదిరిగా అద్దెలకు ఇచ్చేశారు. ఒక మహిళ తన ఇద్దరి పిల్లలను స్విమ్మింగ్‌కు జాయిన్ చేయగా ఒక్కొక్కరికీ రూ.4 వేలు చొప్పున నెలకు కాంట్రాక్టరు వసూలు చేస్తున్నారు. రెస్టారెంట్లు, స్నో పార్కు తాజాగా ఏర్పాటు చేసి రూ.లక్షలను రోజూ ఆదాయంగా సదరు కాంట్రాక్టరు ఆర్జిస్తున్నారు. టెండరు పాడుకున్న తర్వాత మిగతా ఖాళీ స్థలాల వినియోగానికిగానూ పది శాతం పోర్టుకు ఇచ్చేలాగ టెండరు కాపీలో ప్రత్యేకంగా రాసుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా రెస్టారెంట్లు, స్నో పార్కులు వంటివి ఏర్పాటు చేసిన కాంట్రాక్టరు నుంచి 40 శాతానికిపైగా వసూలు చేయకుండా 10 శాతం అనడం వెనక లొసుగు ఏమిటని పోర్టు అధికారులను పలువురు ప్రశ్నిస్తున్నారు.

బిడ్డింగ్ ప్రాసెస్‌లో కాంట్రాక్టర్‌కు వెళ్లింది : పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్

పోర్టు స్టేడియం గతంలోనే బిడ్డింగ్‌లో విశ్వనాథ్‌కు వెళ్లిందని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. పోర్టు కళావాణిని బాగా అభివృద్ధి చేయాలని ఇటీవల పోర్టు అడిటోరియాన్ని సందర్శించిన తర్వాత పోర్టు ఛైర్మన్ అంగముత్తు తమకు ఆదేశాలు జారీ చేసారని చెప్పారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు.

అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి, వైసిపి నేతలు

కలెక్టరేట్ల వద్ద వైసిపి 'యువత పోరు'

మేయర్ హరివెంకట కుమారి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

అనకాపల్లి కలెక్టరేట్ వద్ద చేపట్టిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడారు. విద్యార్థులను కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం లేదన్నారు. నేడు రాష్ట్రంలో విద్యార్థులు చదువులు మానుకునే పరిస్థితి నెలకొందన్నారు. తొలుత అనకాపల్లిలోని పార్టీ కార్యాలయం నుంచి ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీగా కలెక్టరేట్ చేరుకున్నారు. అక్కడ ఆందోళన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ భీశెట్టి సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు ఉప్పలపాటి వెంకటరమణ మూర్తి రాజు, కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్ రాజు, పెట్ల ఉమా శంకర్ గణేష్, కంబాల జోగులు, నియోజకవర్గ సమన్వయకర్తలు మలసాల భరత్ కుమార్, ఈర్లె అనురాధ, బొడ్డేడ ప్రసాద్, శరగడం చిన్నఅప్పలనాయుడు పాల్గొన్నారు.

పేదల గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సహాయం

24696 గృహాలు నిర్మాణంలో ఉన్నాయని, వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించి 8619 మంది లబ్ధిదారులకు 43.40 కోట్ల రూపాయల అదనపు సాయం అందుతుందని అన్నారు. జిల్లాలో మే నెలాఖరుకు 7,750 గృహాలు పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సిహెచ్.సత్తిబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సంబంధించి 13,548 మంది లబ్ధిదారులకు 70.04 కోట్ల రూపాయలు అదనపు ఆర్థిక సహాయం అందజేస్తారని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మే నెలాఖరు నాటికి 13,687 గృహాలను పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు.

విశాఖలో రెండు ఐకానిక్ ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి..) సహాయపడతాయని అధికారులు తెలిపారు. మొదటి ప్రాజెక్టును ఈస్ట్ కోస్ట్ హెబిటాట్ సెంటర్ పేరిట రుషికొండ లా కాలేజీ రోడ్డులోని పనోరమా హిల్స్ ఎదురుగా నిర్మించనున్నారు దీనికోసం 8.82 ఎకరాలను గుర్తించారు. న్యూఢిల్లీలోని ఇండియన్ హ్యాపీ టార్చ్ సెంటర్ తరహాలో రూపొందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ భవనంలో కమర్షియల్ ఆఫీస్ స్పేస్, వ్యాపార కేంద్రం, ఆడిటోరియం, ఈవెంట్ హాల్, ఆర్ట్ గ్యాలరీ, ట్రేడ్ కం ఎగ్జిబిషన్ హాల్, బిజినెస్ హాల్, బోటిక్ హాల్, సర్వీస్ అపార్ట్‌మెంట్ నిర్మిస్తారు. ఈ నిర్మాణానికి రూ.460 కోట్లు అవుతుందని అంచనా వేశారు. రెండో నిర్మాణం వైజాగ్ ఎక్స్పీరియన్స్ అండ్ వర్చువల్ రియాలిటీ ఎరీనా (3 స్టార్ హోటల్) ప్రాజెక్టును రుషికొండలోని లా కాలేజీ రోడ్డు వెంబడి ఉన్న వీఎంఆర్‌డిఎకు చెందిన 2.82 ఎకరాల భూమిలో నిర్మించనున్నారు. ఈ నిర్మాణంలో ఎక్స్‌పీరియన్స్ అండ్ వర్చువల్ రియాలిటీ (వీఆర్) ఎరీనా, 360ఒ (డిగ్రీ) ఇమ్మర్సివ్ థియేటర్, మిక్స్‌డ్ రియాలిటీ ఎస్కేప్ రూమ్, థీమాటిక్ యానిమేషన్ షో, వర్చువల్ టైమ్ ట్రావెల్ అండ్ హెరిటేజ్ ఎక్స్‌పీరియన్స్, వీఆర్ గేమింగ్ జోన్, అక్వేరియం, యాప్ ఎనేబుల్డ్ డైనింగ్ అండ్ డ్రైవ్ ఇన్ ఎక్స్‌పీరియన్స్, ఆల్ టైమ్ కేఫ్‌లు, ఫుడ్ కోర్ట్, ఫైన్ డైనింగ్ మొదలైనవి ఉండనున్నాయి.

వీఎంఆర్‌డిఏ విడుదల చేసిన నిర్మాణ నమూనాలు

సైబర్ సెక్యూరిటీలో యువత నిపుణులుగా మారాలి

(మొదటి పేజీ తరువాయి..) ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (ఐఎస్ఇఎ) ప్రాజెక్ట్ – 3లో భాగంగా ఈ ఐదు రోజుల బూట్ క్యాంపును సైబర్ సెక్యూరిటీ, ప్రైవసీ, క్రిప్టోగ్రఫీ వెబ్ అప్లికేషన్, పెనట్రేషన్ టెస్టింగ్ అంశాలపై నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రశ్నించడం మొదలు పెడితేనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. సైబర్ దాడులు, సైబర్ నేరాలు అనేక దేశాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న విధానాన్ని వివరించారు. ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకున్న దానికి భిన్నంగా బూట్ క్యాంపులో నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని చెప్పారు. పోలీస్ శాఖ నేడు అనేక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటోందని అన్నారు. సదస్సు సమన్వయకర్త ఆచార్య వి.వల్లి కుమారి మాట్లాడుతూ ఐదు రోజుల బూట్ క్యాంపునకు 56 మంది హాజరయ్యారని, వారికి నాలుగు అంశాలపై సమస్యలను ఇచ్చి పరిష్కరించే విధంగా సన్నద్ధం చేశామని చెప్పారు.

NOTICE

IN THE HON'BLE COURT OF JUDGE FAMILY COURT CUM V ADDL. DIST JUDGE: AT: VISAKHAPATNAM
F.C. O.P. No. (2044) Of 2024

BETWEEN:-
Smt. Betha @ Kapu Syamala
Betha Lakshmi Varaha
Narasimha Murthy ...Petitioner.

AND

Betha Lakshmi Varaha
Narasimha Murthy ...Respondent

Betha Lakshmi Varaha Narasimha Murthy, S/o. Sanyasi, age: 55 year Occ: Security gaurd, Aadhar No. 546225480506 Native at H. No at D. No. 1-110-9 Flat No. 203, Sri Ganesh Hights, Ganesh Nagar, Beside NIR College, Chinnamusidi wada, Pendurthy, Visakhapatnam-531173. Presently residing at D. No. 32-1-61, Bangaramma Thalli Temple Street, Nathayyapalem, Visakha patnam-530012.

Whereas the above named Petitioner has filed a Petition Under Section 13 (1) (1a) & (1b) of Hindu Marriage Act against you.

The above said matter is posted on 31-03-2025 at 10:30 a.m. for your appearance and counter if any before this Hon'ble Family Court cum V Addl. Dist. Judge Visakhapatnam.

Therefore take notice that on the above said date and time for your appearance and counter if any before the Hon'ble Family Court-cum-V Addl. Dist.Judge Visakhapatnam, In case of making default by you the petition will be heard and determined in your absence

//By Order of the Court//
Sagarla Raghu
Advocate
Counsel for the Petitioner

IN THE HON'BLE COURT OF THE IV ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: VISAKHAPATNAM
O.S. 1375/2023

Between:
Union Bank of India (e-Andhra Bank)
AU Campus Branch, Visakhapatnam ...Plaintiff

And:
Kaparapu Donga & 2 others ...Defendants

SUMMONS

To,
D-1: Kaparapu Donga, S/o. K.Veera Swamy, Hindu, Aged 59 years, R/at D.No.9-321/2, RamalayamVeedhi, Near Police Quarters, Visalakshinagar, Visakhapatnam-43, Working as ASI, ID No.239, Office of the Superintendent of Police, Visakhapatnam-530043.
D-2: Killo Arjun, S/o. K. Konddappa, Hindu, Aged 55 years, R/at D.No.13/100, Kailasagiri Police Quarters, Visalakshinagar, Visakhapatnam, Working as a Constable ID No.1502, Office of the Superintendent of Police, Visakhapatnam-530043.
D-3: Gullela Thirupathi Rao, S/o. G. Sanyasinaidu, Hindu, Aged 46 years, R/at D.No.6/48, New Block, Police Quarters, Jailasagiri,Visalakshinagar, Visakhapatnam-43, Working as a Constable ID No.1793, Office of the Superintendent of Police, Visakhapatnam-530043.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of an amount of **Rs.6,00,701.91ps** and the suit stands posted to **21-03-2025** for your appearance. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **21-03-2025** at **10:30 A.M** in the above mentioned Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence and the Hon'ble Court will further pass the necessary orders.

(By Order of the Hon'ble Court)
N. SUVARNA RAJU, Advocate
Kailasapuram Road,
Visakhapatnam-530024

IN THE COURT OF THE IInd ADDL.JUNIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
O.S. No: 1573/2019

Between:
Y.Govinda Reddy ...Plaintiff
And
Akkiraju Maruthi Prasad ...Defendant

Notice to Defendant

To,
Akkiraju Maruthi Prasad S/o A.V.Chalapathi Raju, Electricity Board Employee D.No:39-33-63/3, MIG-92, Madhavadoravuda Colony, Visakhapatnam.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 04-04-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
H.Ramasubramanyam, Advocate,
Ananthapuram. Cell:9885734278.

IN THE HON'BLE COURT OF THE I ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
O.S.412/2024

Between:
Sri Anup Kumar Behera ...Plaintiff

And:
Sri Meghanad Raut ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Sri Meghanad Raut,
S/o. Bijaya Kumar Raut,
Working in Indian Navy,
R/at Flat No. 1A, Building-M,
SVN Colony, Marripalem,
104 Area, Visakhapatnam-530018.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of amount of **Rs.20,30,000/-** and subsequent interest and costs and for other reliefs and the suit stands posted to **28-03-2025** for your appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence and the Hon'ble Court will further pass the necessary orders.

(By Order of the Hon'ble Court)
V. NAGESWARA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9885623768

IN THE HON'BLE COURT OF THE I ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
I.A. 10/2024 in O.S.412/2024

Between:
Sri Anup Kumar Behera ...Petitioner/Plaintiff

And:
Sri Meghanad Raut ...Respondent/Defendant

NOTICE

To, **The Respondent:**
Sri Meghanad Raut,
S/o. Bijaya Kumar Raut,
Working in Indian Navy,
R/at Flat No. 1A, Building-M,
SVN Colony, Marripalem,
104 Area, Visakhapatnam-530018.

Please take notice that the above named petitioner/plaintiff has filed an application I.A.10/2024 in O.S.412/2024 for attach the petition schedule property i.e., retirement benefits of the respondent/defendant within the hands of Garnishee, under Order 38 rule 5 of CPC and the I.A. stands posted to **28-03-2025** for your appearance either in person or through a pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence and the Hon'ble Court will further pass the necessary orders.

(By Order of the Hon'ble Court)
V. NAGESWARA RAO, Advocate
Visakhapatnam, Cell: 9885623768

గ్రామ పంచాయితీ కార్యాలయము – తాళ్లవలస

రేఖా నెం.10/2025 — టెండరు నోటీసు — తేదీ.11-03-2025

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం మండల, తాళ్లవలస గ్రామపంచాయితీ యందు దిగువ షెడ్యూల్ నందు ఉదహరించిన పనులను 2025–26 సంవత్సరపు పారిశుధ్య, ఆఫీసు పనులు నిర్వహణ, మంచినీటి సరఫరా స్కీముల నిర్వహణ, వీధి దీపాలు నిర్వహణ, ఆటో నిర్వహణ, మరియు ఆటోడ్రైవర్ జీతం మరియు డీజిల్ నిర్వహణ పనులు కాంట్రాక్ట్ పద్ధతిపై నిర్వహించుటకు పని వారిని సప్లయ్ చేయుటకు తేది: 15–3–2025న మధ్యాహ్నం 12.00 గంటల వరకు తాళ్లవలస గ్రామ సచివాలయము యందు ఈ దిగువ సంతకం దారునిచే గానీ వారి అనుమతి పొందిన ఇతర ఉద్యోగిచే గానీ సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 1.00 గంటకు అప్పటికి హాజరైన టెండరు దారుల సమక్షములో తెరవబడును. టెండర్‌లో పాల్గొనదలచిన వారు టెండర్ దరావత్తు రూ. 10,000/– (అక్షరములా పదివేల రూపాయలు మాత్రము) చెల్లించి టెండరు షరతులకు లోబడి టెండరు పాల్గొనవలెను.

షెడ్యూల్

వ. నెం	పని వివరములు	పనివారి సంఖ్య	ధరావత్తు మొత్తం
1	పారిశుధ్య పనులు	5	10,000/–
2.	వీధిలైట్‌ల నిర్వహణ & బిగింపు పనులు	2	
3.	మంచినీటి పంపు ఆపరేటిర్ నిర్వహణ పనులు	7	
4.	మంచినీటి పైపులైన్‌ల నిర్వహణ (ప్లంబింగ్ పనులు)	1	
5.	చెత్త తరలింపు వాహన డ్రైవరు మరియు డీజిల్ ఖర్చు	1	

గమనిక: (1) పై పనులు యొక్క టెండర్లు శ్రీ జిల్లా కలెక్టర్ (పంచాయతీరాజ్ విభాగము), విశాఖపట్నం వారి అనుమతికి లోబడి, ఖరారు చేయుటకు మరియు కాంట్రాక్ట్ పనులు చెల్లింపులు చేయుట జరుగును. (2) పై టెండర్లను ఎటువంటి కారణము చూపి గానీ, చూపకుండా గానీ రద్దు పరచుటకు, వాయిదా వేయుటకు, తిరస్కరించుటకు గ్రామపంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు. (3) పూర్తి షరతులు ఇతర వివరములు కార్యాలయము పనివేళల యందు పంచాయితీ కార్యదర్శి వారిని సంప్రదించి తెలుసుకోగలరు.

సం/– పంచాయతీ కార్యదర్శి
గ్రామపంచాయతీ – తాళ్లవలస, భీమునిపట్నం మండలం

దేశభక్తికి 'దండి యాత్ర' నిదర్శనం

ప్రజాశక్తి-మధురవాడ : మహాత్మాగాంధీ 95 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఉప్పుసత్యాగ్రహం దండియాత్ర నేటికీ దేశభక్తి కోసం ఆదర్శనీయమని చంద్రంపాలెం జిల్లా ప్రధానోపాధ్యాయులు గొట్టేటి రవి అన్నారు. పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఆధ్వర్యాన దండియాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో బ్రిటిష్ పాలకులు ఉప్పుపై వేసిన పన్నును నిరసిస్తూ మహాత్మాగాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ ఉప్పు సత్యాగ్రహం చేపట్టిందని తెలిపారు. 1930 మార్చి 12న సబర్మతి ఆశ్రమం నుండి ప్రారంభమై ఏప్రిల్ 6న గుజరాత్ తీరంలోని దండి చేరుకొని ఉప్పును తయారుచేసి, బ్రిటిష్ శాసనాన్ని గాంధీ వ్యతిరేకించారని తెలిపారు. ఈ సందర్భంగా గాంధీతో పాటు అనేక మందిని అరెస్టు చేసినా ఉద్యమం ఆగలేదని, భారత ప్రజలలో మరింత స్వతంత్ర ఆకాంక్ష రగిలిందని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి దేశభక్తి కరువు అయిందన్నారు. విద్యార్థులు సమాజ ప్రగతి కోసం పాటుపడే దేశభక్తిని పెంపొందించు కోవాలని కోరారు. దండి యాత్ర జరిగిన తీరును జోత్స్న ఆంగ్లంలో వివరించారు. గాంధీ, స్వాతంత్ర సమరయోధుల వస్త్రధారణలో విద్యార్థులు పాఠశాల మైదానంలో దండియాత్ర నడక, వందేమాతరం నినాదాలు చేశారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మోహనరావు, ధనలక్ష్మి, శంకర్, అన్నపూర్ణ, వరలక్ష్మి, పద్మావతి, స్వరాజ్యలక్ష్మి, లివింగ్‌స్టన్, శారద శ్రీలక్ష్మి, ఫాతిమా జేసింత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పిఎంఎవై గృహ లబ్ధిదారులకు సబ్సిడీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : పునాదుల స్థాయి నుంచి స్లాబ్ వరకు 2024 డిసెంబర్ 10వ తేదీ వరకు నిర్మాణంలో ఉన్న పిఎంఎవై గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సబ్సిడీ మంజూరు చేసినట్లు హౌసింగ్ రూరల్ ఎఇ ఎం.హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి, బిసిలకు రూ.50 వేలు చొప్పున, ఎస్‌టిలకు రూ.75 వేలు చొప్పున అదనపు సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా తరగతులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి మంజూరు చేసిన రూ.1.80 లక్షలకు ప్రస్తుత సబ్సిడీ అదనం అని తెలిపారు. ఈ సబ్సిడీని వినియోగించుకొని నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు.

సూక్ష్మ పోష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని విజయానందపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో సూక్ష్మ పోష్టికాహారం గురించి విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యాన ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ప్రోగ్రాం పోర్షన్ మేళాలో ఐదు రకాల స్టాళ్లను ఏర్పాటుచేశారు. విద్యార్థులకు అయోడిన్, ఆహారపు అలవాట్లు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిసి సాయికృష్ణ, ప్రధానోపాధ్యాయులు నిర్మల పాల్గొన్నారు.

క్లస్టర్ సమావేశం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఆయా క్లస్టర్ పరిధిలో గల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదే క్లస్టర్‌లో ఉపాధ్యాయునిగా ఉన్న డివిఎన్.మాధవరావు ఇటీవల గుండె పోటుతో మృతి చెందడంతో ఎంఇఒ- 2 జయప్రద, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమావేశం ప్రారంభానికి ముందు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

ఏమిటీ 'పరీక్ష'

సదరం క్యాంపుల వద్ద వికలాంగుల దీనస్థితి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన సదరం ధ్రువీకరణ పత్రాల పున్హపరిశీలన కేంద్రం వద్ద కనీస సదుపాయాలు లేక శారీరక వైకల్యం ఉన్న వారు అవస్థలు పడుతున్నారు. ఆనందపురం మండలం ఆనందపురం, బోని, చందక, గంభీరం గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 150 మంది వికలాంగులు సదరం ధ్రువీకరణ పత్రాల పున్హపరిశీలన కేంద్రానికి వచ్చారు. దూరం నుంచి భీమిలికి వచ్చిన వికలాంగులు 'ఏమిటీ పరీక్ష' అంటూ నిట్టూర్చారు. శిబిరం వద్ద టెంట్, కుర్చీలు తప్పితే తాగే నీరు లేదు, మధ్యాహ్న భోజనం లేదు. వికలాంగులకు తోడుగా వచ్చిన సహాయకులు కూడా ఇబ్బందులు పడ్డారు. డిఆర్‌డిఎ, వెలుగు అధికారులు తాగు నీరు, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాల్సి ఉన్నా వారెవ్వరూ తమను పట్టించు కోలేదని వికలాంగులు ప్రజాశక్తి వద్ద వాపోయారు. సదరం ధ్రువీకరణ పత్రాల పున్హపరిశీలన కేంద్రాన్ని ఆనందపురం ఎంపిడిఒ జానకి పరిశీలించారు.

శిబిరంలో నిరీక్షిస్తున్న వికలాంగులు

ప్రాజెక్టుల నిర్మాణంలో డ్రోన్ పరిజ్ఞానం

గీతంలో జాతీయ రహదారుల నిపుణుడు

ప్రజాశక్తి-మధురవాడ : దేశంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగంలో ప్రాజెక్టుల ప్రాథమిక నివేదిక తయారుచేయడానికి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, జాతీయ రహదారులు, వంతెనలను పర్వత ప్రాంతాలు, దట్టమైన అడవుల నుంచి నిర్మించే సమయంలో క్షేత్రస్థాయిలో సర్వేలను నిర్వహించడం కష్టసాధ్యమని ఈ కారణంగా సర్వేలకు డ్రోన్‌లను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ఏరియల్ సర్వే ద్వారా పర్యవేక్షించడానికి డ్రోన్ పరిజ్ఞానం ఉపయోగపడుతోందని తెలిపారు. డిపిఆర్ మొదలు ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేంతవరకు వివిధ స్థాయిలలో సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు అవసరమని, నాణ్యతతో ఉన్న సివిల్ ఇంజినీరింగ్ నిపుణుల కొరత ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ ఇంజినీరింగ్ సర్వీసులలోకి ప్రవేశించి నైపుణ్యాలను చాటాలని సూచించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డి.ముఖుంద పాల్గొన్నారు. గీతం పూర్వ విద్యార్థులను సన్మానించారు.

ప్రహరీ నిర్మించి కాలువను పూడ్చండి

హైస్కూల్లో పిఎంశ్రీ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-ఆనందపురం: కూలిపోయిన ఆనందపురం హైస్కూల్ ప్రహరీని ముందుగా నిర్మించి, తర్వాత నీరు పోయే కాలువను పూడ్చాలని గ్రామస్తులు డిమాండ్‌చేశారు. పిఎంశ్రీ కింద మంజూరైన నిధులతో హైస్కూల్లో బుధవారం పిఇటి ప్రసాద్ ఆధ్వర్యాన పనులు చేపట్టారు. మైదానాన్ని చదును చేసే ప్రక్రియలో హైస్కూల్ తూర్పు పక్కన ఉన్న కాలువను పూడ్చి పనులను చేపడుతున్నారు. దీంతో సమీపంలో ఉన్న కాలనీవాసులు వచ్చి ముందుగా ప్రహరీ నిర్మించిన అనంతరం కాలువను పోల్చాలని ఉపాధ్యాయులను నిలదీశారు. ప్రహరీ ఏర్పాటుచేయకపోవడంతో వర్షపు నీరు నేరుగా కాలనీలోకి వచ్చి ముంపునకు గురయ్యే ప్రమాదముందని, ముందుగా ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని పిఇటి ప్రసాద్ చెప్పారు.

ప్రహరీ ఏర్పాటులో నిర్లక్ష్యం

ఆనందపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ గత వర్షాకాలంలో పడిపోయింది. అప్పట్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాఠశాలను సందర్శించి మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చారు. నేటికీ మరమ్మతులు చేపట్టలేదు సరికదా శిథిలాలను కూడా తొలగించలేదు. ప్రహరీ లేకపోవడంతో సమీపంలోని ఉన్న ఇళ్లల్లోకి రాత్రి వేళల్లో విష సర్పాలు వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శిథిలాలు తొలగించకపోవడంతో వర్షపు నీరు పోవడానికి వీలు లేకుండా పోయింది. దీని కోసం హైస్కూలు మైదానం తూర్పు పక్కన పెద్ద కాలువను తీసి నీరు పోవడానికి తాత్కాలిక కాలువ ఏర్పాటుచేశారు. వర్షం పడితే తాత్కాలిక కాలువ ద్వారా నీరు పోతున్నప్పటికీ ఆ మైదానం కోతకు గురవుతోంది. అధికారులు పరిశీలించి ప్రహరీని పునర్నిర్మించి, వర్షపు నీరు పోవడానికి సరైన మార్గాన్ని ఏర్పాటుచేయాలని, రోడ్డు, క్రీడా మైదానం కోతకు గురికాకుండా పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా అనంతపద్మనాభస్వామి తెప్పోత్సవం

ప్రజాశక్తి- పద్మనాభం : పద్మనాభంలోని అనంతపద్మనాభస్వామి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో నానాజీబాబు ఆదేశాల మేరకు ఎంపిపి రాంబాబు ఆధ్వర్యాన నిర్వహించారు. కుంతీ మాధవస్వామి ఆలయంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేతుడైన అనంతపద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై కూర్చోబెట్టి గాలి గోపురం నుండి పద్మనాభం పుర వీధుల్లో ఊరేగించారు. స్వామివారిని అమ్మవార్లను కోనేటి వరకు ఊరేగించి, కోనేటిలో ఉన్న తెప్పపై పురోహితులు ఆలయ ఆనవాయితీ ప్రకారం కూర్చోబెట్టి మూడు సార్లు ప్రదక్షిణ చేయించారు.

పద్మనాభం కాంతిమయం

తెప్పోత్సవాన్ని పురస్కరించుకొని కుంతీ మాధవస్వామి ఆలయం నుండి కోనేటి వరకు విద్యుత్ అలంకరణ చేశారు. కోనేటి గట్టుపైనా విద్యుత్ అలంకరణ చేయడంతో తెప్పోత్సవం పట్టపగలే నిర్వహించినట్లు కనిపించింది..

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-మధురవాడ : పాత పరదేశిపాలెం 11 కెవి ఫీడర్‌పై మరమ్మతులు చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3గంటల వరకు పాత పరదేశిపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం ప్రాంతాలలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

ప్రజాశక్తి -ఆనందపురం : వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందజేయనున్నట్లు వ్యవసాయ శాఖాధికారి సంధ్యా రత్నప్రభ తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు, చేతి పంపులు (మందు క్యాన్లు), పవర్ స్ప్రేయర్లు (పెట్రోల్ పంపులు), ట్రాక్టర్‌కు జతపరిచే పనిముట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పరికరాలను రాయితీపై పొందాలనుకునేవారు ఆయా గ్రామాల్లోని సమీప రైతుసేవా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించాలని, ఈ పథకం ద్వారా ఒక రైతుకు ఒక పరికరం మాత్రమే ఇవ్వనున్నట్లు వివరించారు. పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నెంబర్ ఇవ్వాలని కోరారు. గత మూడేళ్లలో ఈ పంటలో నమోదు కావడంతోపాటు భూసార పరీక్ష కార్డు ఒక ఏడాదిదైనా సమర్పించాలని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలు కుల ధ్రువీకరణ పత్రం జతచేయాలని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఎస్ఎంఇ పార్కుకు ప్రభుత్వ భూముల పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం : ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటుకు మండలంలోని కృష్ణాపురం, రెడ్డిపల్లి, శేరీఖండం గ్రామాల్లో ప్రభుత్వ భూమిని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ బుధవారం పరిశీలించారు. 50 నుండి 100 ఎకరాలు భూమిని సేకరించి ప్రభుత్వానికి అప్పజెప్పాలని పద్మనాభం తహశీల్దార్ కాకర ఆనంద్‌కుమార్ జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామల, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఫార్మా కాలుష్యాన్ని నివారించాలి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ ఫార్మా కంపెనీ ద్వారా వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపి మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు అల్లిపిల్లి ఎల్లాజీ, సంఘం మహిళా అధ్యక్షులు పేర్ల ధనలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం కారణంగా సముద్రంలో మత్స్యసంపద నశించిపోతుందని, అనేక తాబేళ్లు మృత్యు వాత పడుతున్నట్లు ఆరోపించారు. తాగే నీరు, గాలి కాలుష్యం కావడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్నవరం పంచాయితీ పైలపేట, ఎస్‌సి కాలనీలోని కొంతమంది పలు చర్మ సంబంధిత, కిడ్నీ తదితర దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్నారని విమర్శించారు.

నేడు అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : వరల్డ్ కిడ్నీ డేను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ జీవనదాన్ ఆధ్వర్యాన గురువారం ఆర్‌కె.బీచ్‌లో అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర జీవన్ దాన్ కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. ఉదయం 6 గంటలకు కాళీమాత దేవాలయం వద్ద జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యారాణి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద హాజరవుతారని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పద్మనాభం : మండలంలోని గంధవరం గ్రామంలో తాగునీటి బోర్లకు బుధవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. 'గంధవరంలో దాహం కేకలు' శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించారు. గ్రామ కార్యదర్శి సురేష్ బ్రహ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ మండల ఎఇ పి.హరీష్ గ్రామంలో బోర్లను పరిశీలించి వెంటనే మరమత్తులు చేయించారు. గ్రామస్తులకు తాగునీటిని అందించారు.

బోరును బాగుచేస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది

అత్యాచారాలను అరికట్టాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : చిన్నారులు, మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని గాయత్రి విద్యా పరిషత్ సైంటిస్ట్ డాక్టర్ శైలజ అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో పిడిఎస్‌ఒ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన 'చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు- సామాజిక మూలాలు' అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శైలజ మాట్లాడుతూ, సోషల్ మీడియా ప్రభావం యువతపై చాలా ఎక్కువగా ఉందన్నారు. ఎక్కడికక్కడ మద్యం షాపులను ఏర్పాటు చేస్తూ యువతను మద్యం మత్తులో ముంచుతున్నారని, దీని వల్ల అఘాయిత్యాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలన్నారు. పిడిఎస్‌ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ, అత్యంత అమానుషమైన, హేయమైన, మాటల్లో వర్ణించలేని రూపాల్లో స్త్రీలపై, చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ, దేశంలో గంటకు 47 ఘటనలు జరుగుతున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. ఇటువంటి ఘటనలు జరక్కుండా మూలాలను అరికట్టాలని కోరారు. ఉపాధ్యాయులు ఆర్.ఆషా మాట్లాడుతూ, అఘాయిత్యాలకు కారణమవుతున్న మద్యం, మత్తు పదార్థాలను, పోర్న్ సైట్లు నిషేధించాలని, స్త్రీలను భోగ వస్తువుగా చూపిస్తున్న టీవీ ప్రోగ్రామ్‌లు, సినిమాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఎన్.భాస్కర్, పి.విశ్వనాథ్, రాజేష్, సతీష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసును పునఃప్రారంభిస్తున్న అతిథులు

పోస్టాఫీసు సేవలు పునఃప్రారంభం

ప్రజాశక్తి- మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధి మాధవధారలో బుధవారం పోస్టాఫీసు సేవలను పున:ప్రారంభించారు. గత కొద్దిరోజులుగా 50వ వార్డులోని పోస్టాఫీసును ఇండస్ట్రియల్ ఎస్టేట్ కు తరలించడం ప్రజలు పడుతున్న ఇబ్బందులపై వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్, బిజెపి నాయకులు కిల్లి శ్రీరామ్మూర్తి స్పందించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును, జిల్లా కలెక్టర్‌ను వారు పలుమార్లు కలిసి మాధవధారలో పోస్టాఫీసును ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై వారు స్పందించి శ్రీ మాధవ యువజన సమాజం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పోస్టాఫీసును సనపల వరప్రసాద్, కార్పొరేటర్ వావిలాపల్లి ప్రసాద్, పోస్టల్ సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మీనా బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షులు సనపల సాగర్, పప్పల రామచంద్రరావు, సనపల రామ్‌గోపాల్, బిజెపి నాయకులు వెంకటరావు, సనపల నరసింహస్వామి, నాగచంద్రుడు, సనపల రామకృష్ణ, లోహిత్ రావు, పూజారి ఉదయ్ కుమార్, ఎండా ధాత్రి పాల్గొన్నారు.

వైద్యరంగం ప్రభుత్వాధీనంలో ఉండాలి

ప్రజాశక్తి- మాధవధార : వైద్యరంగం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని లేకుంటే ప్రజల ఆరోగ్యానికి రక్షణ ఉండదని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకట్రావు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పుతున్న నూతన వైద్య కళాశాలలకు ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) నమూనాను వర్తింపజేయడం ప్రజారోగ్యాన్ని చీకటిమయం చేయడమేనని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వ రంగంలో వైద్య విద్య ఉండాలన్నారు. ప్రైవేట్ కాలేజీలలో సీట్లు కొనలేక వైద్య విద్యపై ఆసక్తి ఉన్న చాలామంది తమ ఆలోచనను విరమించుకుంటున్నారని తెలిపారు. ముఖ్య మంత్రి, వైద్యశాఖ మంత్రి దీనిపై పునరాలోచన చేయాలని కోరారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో ముగిసిన భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-కరాస: విశాఖపట్నంలోని నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్)లో నిర్వహించిన 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు ముగిశాయి. కార్యక్రమం ప్రధానంగా ఎన్ఎస్‌టిఎల్ సోదర వర్గానికి భద్రతపై అవగాహన కల్పించారు. సేఫ్టీ వీక్ సందర్భంగా సేఫ్టీ వాక్, సేఫ్టీ క్విజ్, సేఫ్టీ ఎలోక్యూషన్, సేఫ్టీ మాక్ డ్రిల్, సేఫ్టీ ఫైర్ ఫైటింగ్ ట్రెనింగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్ల పంపిణీ తదితర భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.సురేష్ ప్రమాద నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో రమణ బాబు, జివి రామకృష్ణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఐద్వా వ్యవస్థాపక దినోత్సవం

కంచరపాలెం జోన్‌లో వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి -యంత్రాంగం

మాధవధార : ఐద్వా వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా కంచరపాలెం జోన్‌లో ఐద్వా సీనియర్ నాయకులు ఎం.జయలక్ష్మి జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా కంచరపాలెం జోన్ అధ్యక్షులు కె.అనురాధ మాట్లాడుతూ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆంధ్రప్రదేశ్‌లో 1936లో ఏర్పడిందని, అన్ని రాష్ట్రాలకు విస్తరించి 1981 మార్చి 12న ఐద్వాగా ఏర్పడిందని వివరించారు. మహిళల హక్కుల కోసం పోరాడటం, లింగ సమానత్వం సాధించటం, మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపించడం లక్ష్యాలుగా ఐద్వా పనిచేస్తుందని చెప్పారు. మహిళల విద్య, ఉద్యోగం, ఆరోగ్యం హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం తదితర అంశాలపై ఉద్యమాలు నడిపిస్తుందని తెలిపారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు అన్ని రాష్ట్రాలలో కోటిన్నర సభ్యత్వంతో ఐద్వా విస్తరించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకులు అమలమ్మ, ఎం సుజాత, సిహెచ్.కమలమ్మ, ఒ.విజయ, ఆర్.భవాని తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు బంటా కాలనీ, చైతన్యనగర్‌లో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ, నాయకులు రమణి మాట్లాడుతూ, చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు వెంటనే అమలు చేయాలని, మహిళలపై లైంగిక వేధింపులు వ్యతిరేకంగా, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్, మాతృ సంరక్షణ హక్కుల కోసం, అన్ని వర్గాల మహిళలను ఐక్యం చేసి సమాజాన్ని మార్చే దిశగా ఐద్వా ఉద్యమాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట లక్ష్మి, సత్యవతి, రమణమ్మ, సరోజినీ, సూరీడమ్మ, దేముడమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బంటాకాలనీ చైతన్యనగర్‌లో మాట్లాడుతున్న పద్మ

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్ రద్దుచేయాలి

దీక్షలో కూర్చున్న పోర్టు యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్ రద్దు చేయాలని యునైటెడ్ డాక్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 163వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలనుద్దేశించి సత్యనారాయణ మాట్లాడుతూ, ఏటా రూ.వందల కోట్లు లాభాలను సంపాదిస్తున్న పోర్టు ఉద్యోగుల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయడం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. దాంట్లో నాలుగో వాటా ఖర్చుపెట్టినా హాస్పిటల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని నియమించవచ్చని తెలిపారు. ఇలా ఆలోచించకుండా ప్రయివేటు వారికి అప్పగించాలని ఆలోచించడం దుర్మార్గమన్నారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రయివేటీకరణపై తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.త్రినాధరావు, నాయుడు, రామారావు, బి.జగన్, నర్సింగరావు, లక్ష్మణ్, రాఘవులు, పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన బుధవారం పేదలు సీతమ్మధార తహశీల్దార్ ఎం.రమేష్‌కు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ఎం.పైడిరాజు, పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా హామీలు అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు షేక్ రహిమాన్, జిఎస్‌జె.అచ్యుతరావు, పడాల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి విద్యానికేతన్‌లో సైన్స్ ఎక్స్‌పో

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక హైస్కూల్ రోడ్డులోని స్వామి విద్యానికేతన్ పాఠశాలలో ఆధునిక మానవుడు సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యాన డ్రిప్ ఇరిగేషన్, రెయిన్ వాటర్, హార్వెస్టింగ్, విండ్ మిల్, సోలార్ ఎనర్జీ, ఎకో ఫ్రెండ్లీ హౌస్, ప్లాంట్ సెల్, ఎలక్ట్రికల్ జనరేటర్, వాల్కేనో, ఎన్విరాన్మెంటల్, సోలార్ సిస్టం, డిఫరెంట్ బాడీ ఆర్గాన్స్ ప్రాసెస్ తదితర అంశాలపై సైన్స్ ఎక్స్‌పో బుధవారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలను గాజువాక తహశీల్దార్ శ్రీవల్లి సందర్శించి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో ఎంఎస్ స్వామినాథన్ తెచ్చిన గ్రీన్ రివల్యూషన్ కారణంగా హైబ్రిడ్ విత్తనాలు, ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ వాడకం వల్ల ఆహార ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. వైద్యాధికారి డాక్టర్ హేమలత మాట్లాడుతూ, వైద్యరంగంలో కేన్సర్, ఎయిడ్స్, సార్స్, కోవిడ్ తదితర రోగాలకు ఇప్పటికే స్పెసిఫిక్ మందులు కనుక్కోవడం, ట్రీట్మెంట్ చేయడం ఛాలెంజింగ్‌గా ఉందన్నారు. స్కౌట్స్, గైడ్స్ విశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ లక్ష్మణస్వామి మాట్లాడుతూ, ఆధునిక మానవుడు ఇంత అద్భుతంగా తయారు కావడానికి సైన్స్ అండ్ టెక్నాలజీ కారణమన్నారు.

సైన్స్ ఎక్స్‌పోను సందర్శించిన తహశీల్దార్ శ్రీవల్లి

శంకర్ ఫౌండేషన్‌కు మైక్రో స్కోప్ బహూకరణ

ప్రజాశక్తి-వేపగుంట : సౌత్ ఆసియా ఎల్‌పిజి కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా శంకర్ ఫౌండేషన్‌కు అత్యాధునికమైన మైక్రోస్కోప్‌ను, గడప గడపకు ఉచిత కంటి పరీక్ష ప్రాజెక్ట్‌కు రూ.60 లక్షల విరాళం ప్రకటించారని డిజిఎం కె.బంగారురాజు తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో సౌత్ ఆసియా ఎల్‌పిజి కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నవీన్ మఖీర్జూ మైక్రోస్కోపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు రమేష్ కుమార్, వేణు గోపాల్, ఎల్‌పిజి కంపెనీ సిఎఫ్‌ఒ వికాస్‌వర్మ, రాంనాథ్ పాల్గొన్నారు.

మైక్రో స్కోప్‌ను బహూకరించిన నవీన్ మఖీర్జూ

ముందస్తు గుర్తింపుతో గ్లకోమా నివారణ

ప్రజాశక్తి-యంత్రాంగం

వేపగుంట : ముందస్తు గుర్తింపుతో గ్లకోమాను నివారించవచ్చని డాక్టర్ టి.రవీంద్ర చెప్పారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గ్లకోమా కారణాలు, నివారణ, ప్రభావంపై ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నాయుడుతోటలోని ఆసుపత్రి నుండి వేపగుంట జంక్షన్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజిఎం కె.బంగారురాజు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన గ్లకోమా అవగాహన ర్యాలీ

తగరపువలస : స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో గ్లకోమా వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. వారోత్సవాల ప్రాధాన్యతను ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.సుష్మిత వివరించారు. గ్లకోమా కంటి లోపల పీడనం పెరిగి కంటి నరాన్ని చచ్చుబడేటట్లు చేస్తుందన్నారు. తద్వారా క్రమంగా కను చూపు తగ్గిపోతుందన్నారు. 40 ఏళ్లకు పైబడిన వ్యక్తులు తరచుగా కంటి అద్దాలు మార్చించుకోవాల్సి రావడం, వెలుతురు చుట్టూ రంగుల వలయం లా కనబడటం ప్రాథమిక లక్షణాలు అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ.. చైతన్యపరుస్తూ..

ఉత్సాహంగా సిపిఎం ప్రజా చైతన్య యాత్రలు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

ప్రజా సమస్యలను తెలుసుకొనేందుకు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలు ఉత్సాహకంగా సాగుతున్నాయి.

గాజువాక : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జివిఎంసి 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లో సిపిఎం నాయకులు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. స్థానిక ప్రజలు పలు సమస్యలను సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు దృష్టికి తీసుకొచ్చారు. టిడ్కో గృహాలకు రూ.20 వేలు చొప్పున చెల్లించామని, ఇంత వరకు గృహాలు మంజూరు చేయలేదని తెలిపారు. స్వతంత్‌నగర్‌లో నివాసముంటున్న 200 మందికి పట్టాలివ్వలేదని చెప్పారు. అదాని గంగవరం పోర్టు కాలుష్యం వల్ల నివసించలేకపోతున్నామని, డంపింగ్ యార్డ్ వల్ల రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సొంత ఇళ్లు కల్పించాలని కొందరు కోరారు. పాత ఇళ్లలో ఉంటున్న వారు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ రుణాలు మంజూరు చేయాలని కోరారు. కాలువలు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వివరించారు. వీటిపై జగ్గునాయుడు స్పందిస్తూ సమస్యలన్నింటిపైనా పోరాటం చేస్తామని వారితో చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, బి.రమణ, బంగారం నాయుడు, జి.లక్ష్మి, ఎస్.కృష్ణమూర్తి, డి.శ్రీనివాస్, ఎస్‌విఎ.పరశురాం, ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు ఆధ్వర్యాన నాయకులు అక్కిరెడ్డిపాలెంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలపై సర్వే చేశారు. విశాఖ డెయిరీ కాలుష్యం, విశాఖ పోర్టు ఏర్పాటుచేసే డంపింగ్ యార్డు సమస్యలను ప్రజలు వివరించారు. డబ్బులు కట్టినా టిడ్కో గృహాలు మంజూరుచేయలేదని కొందరు సమస్యలను వివరించారు. ఈ సర్వేలో సిపిఎం నాయకులు ఎ.లోకేష్, బి.శ్రీనివాస్, ఆంజనేయులు, బి.అప్పారావు, నానాజీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పైడిరాజు తదితరులు

62, 63 వార్డుల్లో...

ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి దుర్గానగర్, 63వ వార్డు పరిధి కాకరలోవలో సిపిఎం నాయకులు సర్వే నిర్వహించారు. కరెంటు ఛార్జీల భారం, గ్యాస్ ఉచిత సిలిండర్ల డబ్బులు కొందరికే వచ్చాయని, తల్లికి వందనం ఇవ్వలేదని పలువురు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలపై సిపిఎం పోరాడుతుందని నాయకులు హామీఇచ్చారు. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు కె.పెంటారావు మాట్లాడుతూ 17వ తేదీ వరకు సర్వే జరిపి 18వ తేదీ నుండి సమస్యలపై దరఖాస్తులు నింపి సచివాలయాల వద్ద ధర్నాలు చేపడతామని, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.అర్జునరావు, గణేష్, జి.శంకర్రావు, డి.రాజు, రాము, నీలయ్య, పైడిరాజు, సత్తిబాబు, ఈశ్వరరావు, మోహన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అచ్యుతాపురం : మండలంలోని చౌడపల్లి జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం చౌడపల్లి జగనన్న కాలనీలో సిపిఎం నేతలు పర్యటించారు. కాలనీ వాసులను ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు వంటి సమస్యలను లబ్దిదారులు సిపిఎం నేతల దృష్టికి తీసుకొచ్చారు. చౌడపల్లి కాలనీలో వాటర్ ట్యాంక్ లేక నీటికి కోసం ఇబ్బంది పడుతున్నట్లు మహిళలు చెప్పారు. వెదురువాడ జగనన్న కాలనీలో వారం రోజులుగా నీటి సమస్య ఉందన్నారు. చౌడపల్లి పంచాయతీలో కొంతమందికి పట్టాలిచ్చి నేటికీ స్థలాలు చూపలేదని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, కె.సోమునాయుడు, ఆర్.లక్ష్మి, కర్రి రమణ, మోహన్‌రావు, అప్పారావు, శేషుబాబు, శ్రీనివాస్, భవాని, నాని పాల్గొన్నారు.

చౌడపల్లి జగనన్న కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎన్‌టిపిసి అధికారులు

పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఎన్‌టిపిసి సింహాద్రి సిఎస్ఆర్ నిధులతో పరవాడ మండలం ఇస్లాంపేటలోని 14 ప్రభుత్వ పాఠశాలల నుండి 500 మంది విద్యార్థులతో లంకెలపాలెం జడ్‌పిహెచ్ స్కూల్‌లో రూరల్ స్పోర్ట్స్ మీట్ బుధవారం నిర్వహించారు. ఖో-ఖో, వాలీబాల్, త్రో బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో పోటీపడుతున్నారు. సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ, హెచ్ఆర్ ఏజీఎం బిబి పాత్ర, సిఎస్ఆర్ హెచ్ఆర్ మేనేజర్ కె ప్రకాశ రావు, మేనేజర్‌తో కలిసి దీపం వెలిగించి, బెలూన్‌లను విడుదల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీర్ శర్మ మాట్లాడుతూ ఫిట్‌నెస్, అకడమిక్ ఎక్సలెన్స్‌లో క్రీడల పాత్రను నొక్కి చెప్పారు. క్రీడల కోసం పాఠశాలలు సమయాన్ని కేటాయించాలని కోరారు. ఎన్టిపిసి సింహాద్రి స్పోర్ట్స్ పాల్గొనే వారందరికీ స్పోర్ట్స్ కిట్‌లను, పిఈటీలు, అంపైర్లకు ట్రాక్ సూట్లు, క్యాప్‌లు, షూలను అందించింది.

జాబ్ మేళా వాయిదా

ప్రజాశక్తి-అనకాపల్లి : మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, సోసైటీ ఫర్ ఎంప్లాయ్మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యాన ఈనెల 14న చోడవరం గవర్నమెంటు డిగ్రీ కాలేజీలో జరగవలసిన జాబ్ మేళాను వాయిదా వేయడమైనదని మైనారిటీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షంసున్నీసా బేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామన్నారు.

రాష్ట్ర పండగగా నూకాంబిక జాతర జిఒ విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారి దేవస్థానం ఈ ఏడాది కొత్త అమావాస్య జాతరలు రాష్ట్ర పండగ చెయ్యాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో జీవోకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పంచలోహ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. గుడి ఆవరణలో బాణాసంచిక కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఉపకమిషనర్, ఆలయ ఈవో, ఎన్ సుజాత, పండగ ప్రత్యేక అధికారి కె శోభారాణి, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

45 యూనిట్లకు సబ్సిడీ రుణాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : జిల్లా వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ ద్వారా మండలంలోని వెనకబడిన తరగతుల వారికి 2024- 25 ఆర్థిక సంవత్సరంలో సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చేందుకు 45 యూనిట్లు మంజూరైనట్లు మండల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతులకు చెందినవారికి బ్యాంకు వారి అంగీకారంతో 45 యూనిట్లు మంజూరు చేయబడతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఓబిఎంఎంఎస్ సబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా నాగ గంగాధర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి చోడవరం : రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ డైరెక్టర్ బి.నాగ గంగాధర్ జన్మదినం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. చోడవరం టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు తదితరులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్న గంగాధర్ చేసిన సేవలను గుర్తించిన పార్టీ గవర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లు నాయుడు, మాజీ జడ్పీటిసి కనిశెట్టి సన్యాసిరావు, మాజీ ఎంపీపీ గూడూరు వెంకట సత్యనారాయణ, టిడిపి యూత్ లీడర్ సకురు కోటేశ్వరరావు, శివాలయం కమిటీ చైర్మన్ గూనూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాజు తదితరులు

టిడిపి నేతలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

టీడీపీ నాయకులపై దాడి చేసి హత్య యత్నానికి పాల్పడిన వైకాపా నాయకులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి విశాఖపట్నంలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న అనకాపల్లి మండలం, కొండుపాలెం పంచాయతీ చేనుల అగ్రహారం గ్రామ టీడీపీ నాయకులు, ఎంపీటీసీ మధుపాడ పద్మావతి భర్త మధుపాడ నరసింగరావును బుధవారం ఆయన పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా పీలా గోవింద మాట్లాడుతూ ఇటీవల వైకాపా నాయకులు టీడీపీ నాయకులు మధుపాడ నరసింగరావు, అతని కుటుంబ సభ్యులపై విచక్షణ రహితంగా దాడి చేసి హత్య యత్నానికి పాల్పడ్డారని తెలిపారు. కానీ నేటికీ పోలీసులు వారిపై చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయాన్నీ రాష్ట్ర హోం మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

గర్భిణులకు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి కె చంద్రశేఖర్ దేవ్ అన్నారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ స్టోర్స్‌ను తనిఖీ చేశారు. గర్భిణులకు పిల్లలకు ప్రతి బుధ శనివారాల్లో టీకాలు సక్రమంగా వేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వ్యాక్సిన్లు సరైన ఉష్ణోగ్రతలో నిలువ చేస్తున్నారా, దూర ప్రాంతాల్లో ఉన్న సచివాలయాలకు సరిపడా టెంపరేచర్ మెయింటైన్ చేస్తున్నారా అని సిబ్బందిని ప్రశ్నించారు. నెల రోజులకు సరిపడే వ్యాక్సిన్ల నిల్వ ఉంచాలన్నారు.

చౌడపల్లి సచివాలయం పరిధిలో గర్భిణులకు, ఐదు ఏళ్ల లోపు పిల్లలకు సక్రమంగా అన్ని వ్యాక్సిన్లు వేస్తున్నారా అని సుమారు 20 ఇళ్లకు వెళ్లి సర్వే చేశారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, మగవాళ్లలో నోటి, ఊపిరితిత్తులు, వృషణాల క్యాన్సర్లు గుర్తించే సర్వే ఆరోగ్య సిబ్బంది ఎలా చేస్తున్నారో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో వ్యాక్సిన్ హెల్ప్ చైన్ మేనేజర్ ఆర్ అరుణాచలం, హెల్త్ ఎడ్యుకేటర్ శివరామకృష్ణ పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ రెన్యువల్‌కు ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా కలెక్టర్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ విజయ క్రిష్ణన్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలలో విధులు నిర్వహిస్తున్న 219 మంది జర్నలిస్టులకు సంబంధించి అక్రిడిటేషన్ రెన్యువల్ ప్రతిపాదనలను ఆమోదించడం జరిగిందని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యనారాయణ రావు తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బుధవారం డిస్ట్రిక్ రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యన్నారాయణ రావు మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సంబంధించిన విషయాలను చర్చించడం జరిగిందన్నారు. మీడియా సంస్థల యాజమాన్యాల నుండి డిపిఆర్ఓ కార్యాలయానికి నేటి వరకు అందిన లేఖల ద్వారా 219 మంది ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు మరో మూడు నెలలకు మార్చి 1 నుండి మే 31వ తేదీ వరకు అక్రిడేషన్ రెన్యువల్‌కు ఆమోదం తెలపడం జరిగిందని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ ఆఖరి గడువుగా నిర్ణయిస్తూ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కె.చంద్రరావు, వి.లోవరాజు, టి.రమేష్, హౌసింగ పథక సంచాలకులు వై.శ్రీనివాస్, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ రంజిత్, ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

పిపిపి పద్ధతిలో బిఎన్ రోడ్డు అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చోడవరం : భీమిలి-నర్సీపట్నం (బిఎన్) రహదారిని పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలతో బుధవారం తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సీపట్నం నుండి సబ్బవరం వరకు బిఎన్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతుందన్నారు. ఇందుకోసం సమగ్ర నివేదిక డిపిఆర్ తయారు చేసేందుకు ఎల్ఇఎ సంస్థకు పని అప్పగించినట్లు చెప్పారు. రోలుగుంట మండలం వెలంకాయల గ్రామం నుంచి చోడవరం మండలం అడ్డూరు వరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి ఎంత, ప్రైవేటు భూమి ఎంత, పునరావాసం ఎంత మందికి కల్పించాలి, నష్టపరిహారం ఎవరెవరికి ఇవ్వాలి, దెబ్బతినే కట్టడాలు వివరాలన్నీ సర్వే చేయించి నివేదికను సిద్ధం చేయాలని తహశీల్దార్లను ఎమ్మెల్యే రాజు ఆదేశించారు. రహదారి అభివృద్ధిలో భాగంగా విస్తరణ ఊర్లో 80 అడుగులు, ఊరు బయట వంద అడుగులు ఉండేలా సర్వే జరపాలని సూచించారు. త్వరలోనే సంస్థ సర్వేకి వస్తుందన్నారు. ఈ సమావేశంలో చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం రోలుగుంట తహశీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జయప్రకాష్

విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతాన్ని తగ్గించాలని సమగ్ర శిక్ష జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్.జయప్రకాష్ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని ఎస్‌సిఈఆర్‌టి నిర్దేశించిన అజెండా ప్రకారం పాఠశాలలో అమలవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల డ్రాప్ అవుట్ శాతాన్ని తగ్గించడంలో ఉపాధ్యాయులు బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల డ్రాప్ అవుట్‌నకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరిపాక జడ్పీహెచ్ స్కూల్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఒలు ఎస్. లక్ష్మణరావు, రవీంద్రబాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.తిరుపతిరావు, సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎ-గ్రేడ్

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎ-గ్రేడ్ లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2023, 2024 సంవత్సరానికి సంబంధించిన కళాశాల కార్యనిర్వహణ, పరిపాలనకు సంబంధించి అకడమిక్ ఆడిట్ కమిటీ తనిఖీలు నిర్వహించారని తెలిపారు. కళాశాలలో గల అధ్యాపకుల నుండి కార్యనిర్వాహణ; పరిపాలనపై తనిఖీలు చేశారన్నారు. విద్యార్థులతో అకడమిక్ ఆడిట్ అధికారులు ముఖాముఖీ సమీక్షలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. వారి పరిశీలనలో లభించిన ఆధారాలతో కళాశాలకు ఏ గ్రేడ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీలు కమిటీ సభ్యులు చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ కే.మల్లిబాబు నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరగాయి. ఈ సందర్భంగా కళాశాల ఎ -గ్రేడ్ సాధించినందుకు ప్రిన్సిపల్ డాక్టర్ బి సీతాలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

14న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మునగపాక : ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం నుండి 14న ఉదయం బస్సులు బయలుదేరడంతో పాటుగా, 250 బైకులతో పిఠాపురం వరకు ర్యాలీగా వెళ్లడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మునగపాక గ్రామ శాఖ అధ్యక్షులు సూరిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

15న సీతారాముల విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక అంబేద్కర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారాముల ఆలయంలో ఈనెల 15వ తేదీన సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఉత్సవం వాల్ పోస్టర్‌ను టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ బుధవారం ఆవిష్కరించారు. ధార్మిక సేవలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని సాయికృష్ణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఆలయ కమిటీ సభ్యులు కోనపల్లి రామ్మోహనరావు, బేలా లక్ష్మణరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నేత సాయి కృష్ణ

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి సలహాలివ్వండి

- రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖలు
- విశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయ కృష్ణన్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి

భారత రాజ్యాంగ చట్టాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీల అధ్యక్షులు, సీనియర్ నాయకుల నుండి భారత ఎన్నికల సంఘం సలహాలు, సూచనలు ఆహ్వానిస్తోందని విశాఖ, అనకాపల్లి జిల్లాల ఎన్నికల అధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు హరేంధిర ప్రసాద్, విజయ కృష్ణన్ తెలిపారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ఒక ప్రకటనను జిల్లా ఎన్నికల అధికారులకు పంపినట్లు వెల్లడించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అనకాపల్లిలో ఆ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నాటికి అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు సూచనలను, సలహాలను అందజేయాలని ఎన్నికల సంఘం సూచించినట్లు పేర్కొన్నారు. పరస్పరం అనుకూలమైన సమయంలో పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ సభ్యులతో చర్చించేందుకు ఎన్నికల సంఘం యోచిస్తోందని వెల్లడించారు. వివిధ స్థాయిల్లో పెండింగ్ సమస్యలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకురావాలని కోరినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సంభాషణలు నిర్వహించాలని, అటువంటి సమావేశాలలో వచ్చిన సూచనలను ఇప్పటికే అమలులో ఉన్న చట్టపరమైన నిబంధనలకు లోబడి కచ్చితంగా పరిష్కరించాలని, 2025 మార్చి 31 నాటికి తీసుకున్న చర్యలపై ఎన్నికల సంఘానికి నివేదికను సమర్పించాలని గత వారం జరిగిన ఈసిఐ సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సిఈఓలు, డిఈఓలు, ఈఆర్వోలను ఆదేశించినట్లు కలెక్టర్లు వివరించారు. ఈఐసి కల్పించిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని రాజకీయ పార్టీలను కోరిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో దోహదపడే వివిధ చట్టాల భాగస్వామ్యాన్ని, ఆవశ్యకతలను కూడా రాజకీయ పార్టీలకు రాసిన లేఖలో ప్రస్తావించినట్లు వివరించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, 1951, ఓటర్ల నమోదు నియమాలు 1960, ఎన్నికల నిర్వహణ నియమాలు ప్రవర్తన 1961, సుప్రీంకోర్టు ఆదేశాలు, భారత ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు జారీ చేసిన సూచనలు, మాన్యువల్, హ్యాండ్ బుక్‌లు ఇసిఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

లలితా ఫెర్రో కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యాన పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

లలిత ఫెర్రో పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము డిమాండ్ చేశారు. రాజరాజేశ్వరి లలిత త్రిపుర సుందరి ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను ఎటువంటి అనుమతులు లేకుండా చట్ట వ్యతిరేకంగా యాజమాన్యం మూసివేసింది. కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, మురా కార్మికులకు ఇవ్వవలసిన బకాయి వేతనాలు ఫిబ్రవరి 28 నాటికి ఇస్తామని హామీ ఇచ్చింది. కాని నేటికీ ఇవ్వకుండా పరిశ్రమలో ఉన్న ఉత్పత్తి మెటీరియల్‌ను యాజమాన్యం దొంగచాటుగా తరలిస్తున్న నేపథ్యంలో బుధవారం లలిత ఫెర్రో టెక్ పరిశ్రమ వద్ద సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కార్మికుల వేతనాలు చెల్లించకుండా పరిశ్రమలో మెటీరియల్ తరలించడం అన్యాయన్నారు. జనవరి 23వ తేదీన కరెంట్ బిల్లు కట్టలేదని ఈపిడిసిఎల్ కరెంటు నిలుపుదల చేసింది, అప్పటి నుండి కార్మికులు కంపెనీ తెరుస్తారు? జీతాలు వేస్తారు అనే ఆశతో ఉన్నారని తెలిపారు. కాని యాజమాన్యం కార్మికులకు చట్ట ప్రకారం రావాల్సిన బకాయి వేతనాలు ఇవ్వకుండా తమ సంబంధం లేదని చెప్పడం దారుణమన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన బకాయి జీతాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం, లేబర్ అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అప్పటివరకు పరిశ్రమలో ఉన్న మెటీరియల్ తరలించవద్దని, తరలించడానికి వచ్చిన వాహనాలు వెనక్కి పంపించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లలితా ఫెర్రో కార్మికులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

పరీక్షా సామగ్రిని అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని రావులమ్మపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు సమకూర్చిన పరీక్ష సామగ్రిని స్థానిక సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వి.అరుణ కుమారి, రమణ మాస్టారు, పాఠశాల చైర్మన్ సబ్బవరపు కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. గ్రామ సర్పంచ్ షేక్ ఫాతిమా మున్నీషా బేగం ఆర్థిక సహాయంతో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సమకూర్చారు. హెచ్ఎం సీ.హెచ్.సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సర్పంచ్ మున్నీషా బేగం మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహబూబ్ నిషా, వైస్ సర్పంచ్ ఖాళీషా, ఈగల బాబ్జీ, గ్రామపెద్దలు హుస్సేన్, ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్. ఆచార్యులు, పొల్నాటి రావు,కుమారి, చిన్నారావు, శ్రీదేవి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవీఎంసీ 80వ వార్డు ఎన్టీఆర్ కాలనీ ఉన్న నూకంబిక నగర్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కాలనీలో రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దష్టికి కూటమి నాయకులు తీసుకొని వెళ్లగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణం రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో బుధవారం రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో జనసేన పార్టీ నాయకులు సూరిశెట్టి శ్రీనివాసరావు, సూరిశెట్టి శివ, పెంటకోట గణేష్, జంగం హేమంత్, కాండ్రేగుల నాగేంద్ర, కోరిబిల్లి అప్పారావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రాజాం మాజీ సర్పంచ్ సత్యనారాయణ మృతి

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట

సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

మండలంలోని రాజాం గ్రామ మాజీ సర్పంచ్ నాగులాపల్లి సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి తన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.కొద్దికాలం నక్సలైట్‌గా పనిచేసిన నాగులాపల్లి ప్రభుత్వం పిలుపు మేరకు జనజీవన స్రవంతిలో కలిశారు. నాటి నుండి రెండు దశాబ్దాలకు పైగా ఎన్నో భూ పోరాటాలు చేసి దళిత గిరిజన, బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయించారు. సిరిలోరెడ్డి, గద్దర్, వంగపండు ప్రసాదరావు, మేధాపాట్కర్, తమ్మారెడ్డి భరద్వాజ్ లాంటి వారితో కలిసి పని చేశారు. వ్యవసాయ కూలి సంఘం నాయకుడిని, సిఎస్టీయుఐ జాతీయ ఉపాధ్యక్షుడిగా కార్మికులు కర్షకులు పక్షాన నిలిచారు. తరువాత టిడిపిలో చేరి సర్పంచ్‌గా, బుచ్చెయ్యపేట మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా పనిచేశారు. నాగులాపల్లి మరణం ఈ ప్రాంతంలోని కార్మికులు, కర్షకులు, పేద బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. సిఎస్టీయుఐ జాతీయ అధ్యక్షుడు కనకరావు, జడ్పిటిసి దొండా రాంబాబు, డిసిసి అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు నాగులాపల్లి అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చోడవరం

వ్యక్తి దాడి చేసిన ఘటనలో గాయపడిగన వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు స్థానిక సిఐ పి అప్పలరాజు తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ప్రకారం... స్థల విషయమై గొడవ చోటుచేసుకున్న నేపథ్యంలో చోడవరం బాలాజీ నగర్ చెందిన ఇందల సన్యాసిరావుపై నెమల హరి అనే వ్యక్తి ఈనెల మూడో తేదీన దాడి చేశారు. ఈ దాడిలో సన్యాసిరావుకు తలకు బలమైన గాయం కావడంతో విశాఖ కెజిహెచ్‌కి తరలించి చికిత్స అందించారు. తనపై దాడి చేసిన హరిపై సన్యాసిరావు ఈనెల నాలుగో తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే రోజు కేసు నమోదు చేసి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే పరిస్థితి విషమించి కెజిహెచ్‌లో సన్యాసిరావు బుధవారం మృతి చెందారు. దీనిపై కేసులో ఇంకా ఎవరైనా వ్యక్తుల ప్రమేయం ఉందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

కొబ్బరి మొక్కల నాటివేత

ప్రజాశక్తి-మునగపాక

మండలంలోని మూలపేట గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా కొబ్బరి మొక్కలు నాటివేత కార్యక్రమం బుధవారం చేపట్టారు. గ్రామ ప్రధాన కూడళ్లతో పాటుగా మెయిన్ రోడ్డు నుండి గంగాలమ్మ గుడి వరకు ఈ మొక్కలను సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు, కూటమి నాయకులు బీసెట్టి నాగేశ్వరరావు, ఎల్లపు రాజేశ్వరరావు, శరగడం నాగేశ్వరరావు చేతుల మీదుగా నాటారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందు, మేట్లు సరగడం లీల, ఎల్లపు ఝాన్సీ, గ్రామ పెద్దలు ఎల్లపు నాయుడు, బీసెట్టి వీరు నాయుడు, బీసెట్టి వెంకట అప్పారావు, కూలీలు పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

నర్సీపట్నంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని సారిపల్లిపాలెం జంక్షన్ సమీపంలో వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

అనకాపల్లిడెస్క్:వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను చీడికాడ మండలం వరహాపురం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవెల్లి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు కురచా నారాయణమూర్తి, సుంకర శ్రీను, వైస్ ఎంపీపీ స్వాతి కొండబాబు, చుక్క అప్పలనాయుడు, కో ఆప్షన్ సభ్యులు షేక్ సూర్యానారాయణలు వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పరవాడ మహేష్, శేషు, దేవి నాయుడు యువత పాల్గొన్నారు.

రావికమతం: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఆ పార్టీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మీనాయుడు, ఎంపీపీ పైల రాజు, మండల కన్వీనర్ జగ్గారావు ఆధ్వర్యంలో జరిగాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీలకు, కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా తీసుకొని ప్రజలందరికీ అనేక రకాల సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ కోపరేటివ్ అధ్యక్షులు కంచిపాటి త్రిమూర్తులు, మాజీ వైస్ ఎంపీపీ గంటా ఈశ్వరరావు, తట్టబంద మాజీ సర్పంచ్ నరసింహులు, రావికమతం గర్ల్స్ హై స్కూల్ చైర్మన్ అప్పలనాయుడు, కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైయస్సార్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు పార్టీ జెండా ఆవిష్కరించారు.జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి సత్తిబాబు, వైస్ ఎంపిపి దత్తుడు రాజు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:పట్టణంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ,వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ సీఎం అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు, గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, నాయకులు తమరాన శ్రీను పాల్గొన్నారు.

మాడుగుల :స్థానిక బస్టాండ్ సెంటర్ లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలు మాలలు వేసి నివాళ్ల అర్పించారు. ఈ కార్యక్రమం లో ఎంపీపీ తాళ్లపు రెడ్డి రాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ యడ్ల కళావతి, వైసీపీ నాయకులు బొమ్మిశెట్టి శ్రీను, పొలిమేర విజయలక్ష్మి,షేక్ ఉన్నిషా జవ్వాది వరహాలు పాల్గొన్నారు.

సబ్బవరంమండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద బుధవారం వైసిపి మండల అధ్యక్షుడు కర్రి బాబు ఆధ్వర్యాన ఆ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శరగడం చిన అప్పలనాయుడు, బోకం రామునాయుడు, బైలపూడి భగవాన్ జయరామ్, కొటాన రాము పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రం మునగపాక నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైపిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, బీసెట్టి గంగ అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, మద్దాల వీరు నాయుడు పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి వైసీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్య దొర జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, జడ్పీటీసీ శానాపతి సంధ్యారాము, కౌన్సిలర్లు పడాల శ్రీను, పిట్టా సత్తిబాబు, కొఠారు కొండబాబు, పిల్లా త్రినాధ్, అచ్యుతరావు, శ్రీను, సంతోష్, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కె.కోటపాడులో జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

కె.కోటపాడు : మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ వైసిపి జెండాను ఆవిష్కరించారు. పార్టీ బలోపేతం చేయడానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ : మండలంలోని బోయిల కింతాడ గ్రామంలో వైయస్సార్ విగ్రహానికి మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన 55వ వార్డు పరిధి ధర్మానగర్‌లో వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభంలోని వైసిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు ఆధ్వర్యాన వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి చేరుకొని రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపిపి రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 29వ వార్డు జగదాంబ జంక్షన్‌లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, జాన్ వెస్లీ, కొండా రాజీవ్ గాంధీ పాల్గొన్నారు. అనంతరం వైసిపి వార్డు అధ్యక్షులు పీతల వాసు యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కొలతల ప్రకారం పనులు చేయాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:కనీస వేతనం పొందే విధంగా ఉపాధి కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. నక్కపల్లి లో బుధవారం ఆముదల చెరువు పూడిక తీత పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి సిబ్బంది నిర్దేశించిన కొలతల ప్రకారం ప్రతిరోజు పని చేసినట్లయితే కనీస వేతనం అందుతుందన్నారు. రోజుకు 300 రూపాయలు తగ్గకుండా, పని చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు పాటించాలని ఉపాధి కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భాగ్యలత, పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న డ్రెయినేజీ పనులు

వేగంగా డ్రెయినేజీ పనులు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలోని తట్టబంద జంక్షన్‌లో డ్రెయినేజీ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. అనకాపల్లి, కన్నూరు పాలెం, కొత్తకోట, రావికమతంలను కలుపు ఈ జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుంది. జంక్షన్ ఇరుకుగా మారడంతో పాటు డ్రెనేజీ లేక వాడుక నీరు రోడ్డుపై నిలిచిపోయి తీవ్ర దుర్గంధంతో బురదమయింగా మారుతోంది. వర్షం కురిస్తే రాకపోకలకు సైతం గ్రామస్తులతో పాటు వాహన చోదకులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కష్టాల నుంచి బయట పడేందుకు సర్పంచ్ గోకివాడ రమణ సుమారు 50 లక్షల పంచాయతీ నిధులు, ఉపాధి హామీ పథకం నిధులతో పక్కా డ్రెనేజీ నిర్మాణం తలపెట్టారు. ఇదిలా ఉండగా ఒకరిద్దరు మినహా మిగిలిన దుకాణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించడంతో డ్రెనేజీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:అనారోగ్యంతో బాధపడుతూ ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి వైద్య నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరు అయిన నగదు చెక్ ను చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్ఎస్ రాజు చోడవరం క్యాంపు కార్యాలయంలో బుధవారం అందజేశారు. బుచ్చయ్యపేట మండలం కెపీ అగ్రహారం గ్రామానికి చెందిన జొన్నపల్లి నాగరాజు కుమారుడు తేజ అనారోగ్యంతో ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నాడు. తమ కుమారుడు తేజను ఆదుకోవాలని స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. బాలుడు వైద్యానికి రూ.88729 సీఎం సహాయనిధి ద్వారా మంజూరు చేయించారు. బుధవారం సంబంధిత చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీటీసీ దేవర అప్పారావు, వియ్యపు అప్పారావు, అడ్డూరు శ్రీను పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న ఎంఇఒ నరేష్

ప్రజాశక్తి- నక్కపల్లి:స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కె.నరేష్ అన్నారు. మండల పరిధిలో నక్కపల్లి, చినదొడ్డిగల్లు, వేంపాడు, గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక/ఉన్నత పాఠశాలల్లో తరగతిగదిలో ఉపాధ్యాయులు అనుసరించాల్సిన బోధనా పద్ధతులను, బోధనోపకరణాలను తయారు చేసుకుని ప్రదర్శనగా ఉంచాలన్నారు. నూతన బోధనా పద్ధతులను, వాటిలో మెలకువలను మెరుగు పరచుకోవడానికి ఈ శిక్షణా తరగతులు ఉపాధ్యాయులకు ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. బోధనాభ్యసనాలను, లెస్సన్ ప్లాన్లను తయారు చేసుకుని సమర్ధవంతంగా బోధించాలన్నారు. మారిన నూతన విద్యావిధానంలో ఈ కాంప్లెక్స్ సమావేశాలు ఎంతో ఉపయోగకరమన్నారు. చినదొడ్డిగల్లులో జరిగిన కార్యక్రమంలో హెచ్.ఎమ్. బి.కవిత, కాంప్లెక్స్ పరిశీలకులు డి.సత్యారావు, రిసోర్స్ పర్సన్లు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, కళ్యాణి, శ్రీనివాస రావు, శేఖర్, మైమున్నీషా, అచ్చిరాజు, వై.వి.రమణ, నానాజీ ,రవి, సి.ఆర్.పి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల:మండలం క్లస్టర్ లో ప్రతి నెలా ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో అప్పారావు సూచించారు. మండలంలోని కేజేపురం మాడుగుల, కింతలి క్లస్టర్లలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను బుధవారం మాడుగులలో ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏ విధంగా బోధిస్తున్నారనే అంశాలపై ఉపాధ్యాయులను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దేముడమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా పి - 4 సర్వే

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పి- 4 సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో డి సీతారామరాజు సూచించారు. నక్కపల్లి పంచాయతీ శివారు అప్పలపాయకరావుపేట గ్రామంలో సచివాలయ ఉద్యోగులు చేపడుతున్న పి- 4 సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నిర్మాణంలో ఉన్న జలజీవన్ మిషన్ వాటర్ ట్యాంకు పనులను పరిశీలించారు. త్వరితగతిన ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలన్నారు.

నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు, కూలీలు

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి డెస్క్: గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు డిమాండ్ చేసారు. బుధవారం చీడికాడ మండలం వీరభద్ర పేట, సిరిజం పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల గొప్పూరు, కొన్నంపూడి, గదబురు ప్రాంతాల్లో పోస్టర్ విడుదల చేశారు.మండలంలో సుమారు కోటి రూపాయల వరకు బకాయలు ఉన్నాయన్నారు. 11 వారాల నుండి బిల్లులు చెల్లించక పోవడంతో కూలీలు వస్తులతో ఉంటున్నారని తెలిపారు. పని చేసిన ఉపాధి కూలీలుకు పే స్లిప్పులు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదన్నారు గత మూడు సంవత్సరాలుగా బడ్జెట్లో నిధులకు కోత విధించి మెటీరియల్ చార్జీలు పెంచేసారని తెలిపారు గతంలో 20 శాతం సమ్మర్ అలవేన్స్ ఇచ్చే వారని, ఇప్పుడు పూర్తిగా కోత పెట్టారని తెలిపారు. మెడికల్ కిట్లు, తట్ట, గుణపాం వంటి వాటికి కోత పెట్టారని తెలిపారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో కుంబోయిన కన్నబాబు రాజు, సన్యాసమ్మ, కొండమ్మ, భవాని, సీతమ్మ పాల్గొన్నారు.

క్రికెట్ జట్ల డ్రా తీస్తున్న నాయకులు

నేటి నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -నక్కపల్లి:ఈనెల 24న రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పుట్టిన రోజు సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ గురువారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో నక్కపల్లి లో హోం మంత్రి నివాసం వద్ద బుధవారం టిడిపి శ్రేణులు క్రికెట్ మ్యాచ్ లకు సంబందించి క్రికెట్ జట్ల కెప్టెన్ ల సమక్షంలో డ్రా తీసారు. హెటిరో డ్రగ్స్ క్రీడా మైదానంలో గురువారం ఉదయం 8 గంటలకు మొదటి మ్యాచ్ ప్రారంభం కానున్నదని, నియోజకవర్గం లోని వివిధ గ్రామాల నుండి 50 జట్లు క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొన్నట్లు టిడిపి శ్రేణులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలపార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

14న 'ఉక్కు' నిరసనలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14న తలపెట్టిన ఉక్కు నిరసన ప్రదర్శనలను విశాఖలో జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆ రోజు జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఉదయం 10 గంటలకు నిరసన ప్రదర్శన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అలాగే పాత గాజువాక జంక్షన్‌లో నిరసన చేపట్టాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్ణయం చేసినట్టు వెల్లడించారు. వీటితో పాటు అన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమల గేట్ల వద్ద, కార్మికుల పని ప్రదేశాల్లోనూ నిరసనలు తెలపాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు.

రోడ్లను నిర్మించాలని గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో శంకరం పంచాయతీ శివారు గ్రామాలైన తాడివలస, గోప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగలపాడు, కొత్తవలస, మామిడిపాలెం గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించి కొత్తవలస తాడివలస, ఉరక గెడ్డలపై రెండు బ్రిడ్జిలు నిర్మించాలని ఏడు గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు మహిళలు మోకాళ్ళపై నిలబడి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరట.నరసింహమూర్తి, కె భవాని మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, బ్రిడ్జిలు నిర్మిస్తామని నమ్మబలికి ఎన్నికల అయ్యి తొమ్మిది నెలలు అవుతున్నా కనీసం పట్టించు కోలేదన్నారు. వర్షం వస్తే గెడ్డలు దాట లేక గర్భిణీలను, బాలింతలను డోలి కట్టి మోసుకు వస్తున్నారని తెలిపారు. పిల్లలు స్కూలుకు, ముసలి వారు ఆసుపత్రికి వెళ్లలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గోట్టివాడ నుండి కొత్తవలస వెలగలపాడు, గోప్పుపూరు తాడి వలస మీదుగా రాయిపాలెం, రాజంపేట మీదుగా క్రిష్టం పాలెం వరకు రోడ్డు సౌకర్యం కల్పిస్తే వందలాది మంది గిరిజనులకు రోడ్డు సౌకర్యం కలుగుతుందన్నారు.కూటమి ప్రభుత్వ లోని ఎమ్మెల్యే, యంపిలు స్థానికులు కాక పోవడంతో ఇక్కడి గిరిజనుల సమస్యలు తెలియలేదన్నారు. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించక పోతే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సోమల నరసింహారావు, జన్ని చిన్నారావు, సోలం సన్యాసమ్మ,సోలం మంగ గురువుల, కృష్ణమూర్తి, సాగరి ఈశ్వరరావు అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- మాడుగుల: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని ఏ గ్రామంలోనైనా తాగునీటి ఇబ్బందులు ఉండకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిలకు సూచించారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలను పూర్తి చేయాలని ఉపాధి హామీపథకం అధికారులను కోరారు. ప్రస్తుతం తక్కువ మంది కూలీలు వస్తున్నారని, దీనికి కారణం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ప్రతి ఒక్క లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పీ4 సర్వేను త్వరగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపుమేరకు బుధవారం ఉదయం ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం వద్ద విశాఖలోని బ్యాంకు అధికారులు, ఉద్యోగులు, క్లర్కులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆఫీసర్స్ యూనియన్ కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ రానున్న 24, 25వ తేదీల్లో బ్యాంకులు సమ్మెకు వెళ్తున్నాయన్నారు. ఐదు రోజుల పని దినాలు, బ్యాంకుల్లో తగిన ఉద్యోగ నియామకాలకు ఆమోదించాలని ఈ కార్యక్రమానికి దిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు, స్టాఫ్ యూనియన్ జాయింట్ జనరల్ సెక్రటరీ బి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న ఉద్యోగులు

అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నాటు సారాతో అనర్థాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నీలకంఠాపురం, రాజాం, మల్లం, అప్పంపాలెం, చిన్న భీమవరం, తురకలపూడి, పంగిడి, గొర్లిపాలెం, పెద్ద మదీనా, బుచ్చయ్యపేట, వి ఆర్ ఆర్ పేట, వడ్డాది పరిసర గ్రామాలలో నాటు సారాతో కలిగే అనర్థాలను ఎక్సైజ్ అధికారులు వివరించారు. సారా తాగడంతో వచ్చే ఆరోగ్య సమస్యలు, దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. చోడవరం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, కె.వి నాయుడు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి:నాటు సారా తయారు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాసు హెచ్చరించారు. మండలంలోని వేంపాడు, గునుపూడి, బంగారమ్మపేట గ్రామాల్లో బుధవారం నాటు సారా రహిత ఏపీ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు గ్రామ సభల ద్వారా అవగాహన కల్పించారు. నాటు సారా తాగడంతో కలిగే దుష్పరిణామాలు గురించి వివరించారు. నాటు సారా కేసుల్లో పట్టుబడితే శిక్షించే కేసులపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లింపునకు చర్యలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపులు సాంకేతిక కారణాలతో జరగలేదని, అటువంటి వారికి అందజేస్తామని జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఈ.ఎన్.వి నరేష్ కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ బాధ్యులు గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో కార్మికులు జివిఎంసి ప్రధాన మెడికల్ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ, కార్మికుల కు జీతాలు ఇప్పించడంలో తమ బాధ్యత ఉందన్నారు. యూనియన్ నాయకుడు అప్పారావు మాట్లాడుతూ,

తమ హక్కులకు భంగం కల్పిస్తే ఊరుకోమన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు మినిమం టైం స్కేల్ (ఎంటిఎస్) లేదా పర్మినెంట్ చేసే వరకు పోరాడుతామన్నారు. స్పందించిన సిఎంఒహెచ్ వెంటనే కార్మికుల డేటా కలెక్షన్ చేసి 2020 సంవత్సరం నుండి నేటి వరకు మిస్సయిన జీతాల కోసం చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నక్క నాగరాజు, వెంకటరావు, కుమారి, ఆనంద్,ప్రసాద్, ఈశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

15న జెడ్‌పి స్థాయీ సంఘాల సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగనున్నట్టు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి. నారాయణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు 2వ, 5వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 11 గంటలకు 3, 4వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అధికారులందరూ తమ శాఖల ద్వారా అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

కాఫీ యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి- పాడేరు:మండలంలోని డి.గొందురు ల్యాండ్ స్కేప్ పరిధిలో మద్దులబంద గ్రామంలో ఆర్ వై ఎస్ ఎస్, సభల్ ప్రాజెక్టులో భాగంగా మండల స్థాయి కాఫీ యాజమాన్య పద్ధతులపై బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మార్చి, ఏప్రిల్, మే నెలలో కాఫీ తోటల్లో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు క్లుప్తంగా సభల్ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ నాయుడు రైతులకు వివరించారు. ఆర్ వై ఎస్ ఎస్ వాసన్ సంస్థల ఆధ్వర్యంలో 100 మంది ఆదర్శ రైతులను గుర్తించి కాఫీ మోడల్ ప్లాట్ లను తయారు చేయించి వారికి ప్రతి నెల యాజమాన్యం పద్ధతులపై, వీడపేడల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమాలు సబల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. కాఫీ, మిరియాల పంటల్లో దిగుబడి పెంచడమే ప్రధాన ధ్యేయంగా ప్రాజెక్టు కృషి చేస్తుందని ఆర్ వై ఎస్ ఎస్ ప్రతినిధి రవీంద్ర తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబల్ ప్రాజెక్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్

ఆందోళన చేపడుతున్న విద్యార్థులు

ఎయు విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: ఆంధ్ర యూని వర్సిటీ మెస్‌లో భోజనంలో జెర్రిని తిన్న విద్యార్థి వాంతులు చేసుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ మేరకు బుధవారం రాత్రి భోజనం ప్లేట్లను ముందు పెట్టుకుని సుమారు 200 మంది విద్యార్థులు ఆంధ్ర యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద నిరసన కు దిగారు.